క్లుప్తంగా

'ఇంటి పన్నులు పెంచుతున్నట్లు తప్పుడు ప్రచారం'

నిజాంపేట్: నిజాంపేట్ నగర పాలక సంస్థ పరిధిలో ఇంటి పన్నులు పెంచుతున్నట్లు కొద్ది రోజులుగా కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. అలాంటి వారి మాటలు నమ్మవద్దని మున్సిపల్ కమిషనర్ రామకృష్ణరావు ఓ ప్రకటనలో తెలిపారు. గతేడాది నిర్వహించిన సర్వే ప్రకారం డిసెంబర్ 2019కు ముందు నిర్మాణం చేసి పన్నులు చెల్లించుచున్న భవనములకు ఎలాంటి పెనాల్టీ విధించడం లేదన్నారు. ఒక వేళ ఏమైనా పొరపాటున ఎవరికైనా పాత భవనాలకు పెనాల్టీ వచ్చినట్లయితే కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ మేళలో ఫిర్యాదు చేసినట్లయితే వెంటనే సవరిస్తామన్నారు.

బాచుపల్లి సెక్షన్ జలమండలి మేనేజర్ సస్పెన్షన్

నిజాంపేట్: బాచుపల్లి సెక్షన్ జలమండలి మేనేజర్ బి.మహేష్‌పై సస్పెన్షన్ వేటు పడింది. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని సాయిఅనురాగ్ కాలనీ, బాచుపల్లి స్థానికుల నుంచి రూ.50వేల మొదులకుని రూ.60వేల లంచాలు తీసుకుని అక్రమ నీటి కనెక్షన్లు ఇవ్వడంతో పాటు తదనంతరం అక్రమ కనెక్షన్లు ఉన్నాయంటూ వారిని లైన్‌మెన్లు, డేలా ఎంట్రీ ఆపరేటర్లతో బెదిరింపులకు గురి చేయడంపై జలమండలి ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. దీనిపై విచారణ చేపట్టిన అధికారులు అక్రమ కనెక్షన్ల వ్యవహారంలో మహేష్ పాత్ర ఉందన్నారు. జలమండలి ఆదాయానికి భారీగా గండిపడిందని గుర్తించారు. ఈ నేపథ్యంలో మహేష్‌ను సస్పెండ్ చేస్తూ అతని స్థానంలో కె.సత్యనారాయణను బాచుపల్లి జలమండలి మేనేజర్‌గా నియమించారు.

5న 'సీఓఈ' అర్హత పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

రాయదుర్గం: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీఓఈ (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్) ఇంటర్మీడియట్ అర్హత పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గౌలిదొడ్డి గురుకుల బాలికల పాఠశాల/కళాశాల ప్రిన్సిపల్ శారద గురువారం తెలిపారు. ఈనెల 5వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సీఓఈ-2023 పరీక్ష జరుగుతుందని అభ్యర్థులు సకాలంలో హాజరవాలన్నారు. పరీక్ష రాసే విద్యార్థులు పరీక్షా కేంద్రానికి గంట ముందే రావాలని ఆమె సూచించారు. విద్యార్థులు హాల్ టికెట్, బ్లూ లేదా బ్లాక్ పెన్ను, పరీక్ష ప్యాడ్ తీసుకురావచ్చని పేర్కొన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

హెచ్‌సీయూ ప్రొఫెసర్లకు అరుదైన అవకాశం

రాయదుర్గం: ఆసియాలో టాప్-20 ఆర్ట్స్ అండ్ హ్యూమనిటీస్ పరిశోధకుల్లో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని ఇంగ్లిష్ ఫ్యాకల్టీ ప్రతినిధులకు అవకాశం దక్కింది. వరుసగా నాలుగో సంవత్సరం విడుదల చేసిన సెంటర్ ఫర్ పబ్లికేషన్స్ ఎథిక్స్, సావిత్రిబాయి పూలే పూణే విశ్వవిద్యాలయ నివేదిక 'భారతదేశం, దక్షిణాసియా, తూర్పు ఆసియాలో కళలు, హ్యూమనిటీస్ పరిశోధనలో ఇద్దరు హెచ్‌సీయూ ప్రొఫెసర్లు నారాయణచంద్రన్, ప్రమోద్. కె.నాయర్‌లకు అవకాశం లభించింది. ప్రొఫెసర్లకు గుర్తింపు రావడం ఆనందకరమని హెచ్‌సీయూ వీసీ ప్రొఫెసర్ బీజేరావు అన్నారు.

ఎఫ్ఓబీ నిర్మాణ పనులు పరిశీలన



రాయదుర్గం: పాదచారుల సౌకర్యార్థం రాయదుర్గం మల్కంచెరువు సమీపంలో నిర్మిస్తున్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ అధికారులు పరిశీలించారు. గురువారం ఈఈ శ్రీనివాస్, డీఈ విశాలాక్షి, ఏఈ జగదీష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ పనులను పరిశీలించారు. అత్యాధునిక సౌకర్యాలతో ఈ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తున్న నేపథ్యంలో ఎస్కలేటర్, లిఫ్ట్ పనులను వారు పరిశీలించారు. పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యమివ్వాలని అధికారులు ఆదేశించారు.

రేపు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

గచ్చిబౌలి: విద్యుత్ సమస్యల పరిష్కారానికి కన్జ్యూమర్ గ్రీవెన్సెస్ సమావేశాన్ని 4వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని ఏడీఈ రాము తెలిపారు. గచ్చిబౌలిలోని విద్యుత్ ఏడీఈ కార్యాలయ ప్రాంగణంలో జరిగే కార్యక్రమంలో గచ్చిబౌలి సబ్ డివిజన్‌లోని గచ్చిబౌలి, తారానగర్ సెక్షన్ పరిధిలోని వినియోగదారుల కోసం జరిగే ఈ సమావేశంలో సీజీఆర్ఎఫ్ చైర్మన్, సభ్యులు, కన్జ్యూమర్ ఎఫైర్ సభ్యులు పాల్గొంటారు. విద్యుత్ వినియోగదారులు వారి యొక్క దీర్ఘకాలికంగా ఉన్న విద్యుత్ సమస్యలతోపాటు బిల్లుల్లో హెచ్చుతగ్గుల విషయంపై కూడా ఫిర్యాదు చేసి తగు పరిష్కారం పొందగలరని అధికారులు కోరుతున్నారు. ఈ అవకాశం విద్యుత్ వినియోగదారులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సిలిండర్

గ్యాస్ ధర పెంపుపై భగ్గుమన్న బీఆర్ఎస్

- ఎమ్మెల్సీ, శాసనమండలి విప్ శంభీపూర్ రాజు ఆధ్వర్యంలో నిరసనలు
- నిజాంపేట్, కొంపల్లి, దుండిగల్‌లో ప్రజాప్రతినిధులతో కలిసి ధర్నా
- కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు



కొంపల్లిలో మాజీ ఎంపీపీ సన్న కవిత, చైర్మన్ శ్రీశైలంయదవ్‌ల ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో ఎమ్మెల్సీ

కుత్బుల్లాపూర్: గృహావసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్ పై ఒకేసారి రూ.50 చొప్పున 'కేంద్రం'భారం మోపడం తగదని... వెంటనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఎమ్మెల్సీ, శాసనమండలి విప్ శంభీపూర్ రాజు అన్నారు . కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మేయర్ కొలన్ నీలారెడ్డి, కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, మాజీ ఎంపీపీ సన్న కవిత, దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని కౌన్సిలర్ల ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలు, ఆందోళన, ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం కార్యక్రమాలు నిర్వహించగా.. పైన పేర్కొన్న మూడు కార్యక్రమాల్లో



జగద్గిరిగుట్టలో సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా

ఎమ్మెల్సీ, శాసనమండలి ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు పాల్గొని ప్రసంగించారు.

ఎమ్మెల్యే వివేకానంద దూరం...

మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని నిజాంపేట్ కొంపల్లి దుండిగల్ మున్సిపాలిటీలో జరిగిన గ్యాస్ పెంపు ఆందోళన కార్యక్రమంలో ఎమ్మెల్యే వివేకానంద పాల్గొనకపోవడం చర్చనీయాంశంగా మారింది. కొంతకాలంగా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద మధ్య ఆధిపత్య పోరు నడుస్తుండగా పైన పేర్కొన్న మూడు ప్రాంతాల్లో ఎమ్మెల్సీ తనదైన శైలిలో పాల్గొని కార్యకర్తల్లో జోష్ పెంచారు. అయితే ఎమ్మెల్యే వివేకానంద మాత్రం కుత్బుల్లాపూర్ డివిజన్లలో పాదయాత్రలో ఉండగా గ్యాస్ సిలిండర్లతో వెళుతున్న ఆటోపై పూలు వెదజల్లి.. వెనక్కి పంపి నిరసన తెలపడం విశేషం.

- ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రెండున్నరేళ్లలో రూ.500కు పైగా పెరుగుదల హోటళ్లు, రెస్టారెంట్లలో వాడే 19 కిలోల వాణిజ్య ఎల్పీజీ సిలిండర్‌పై రూ.350.50 పెంచారని ఆరోపించారు. స్థానిక పన్నులపై ఆధారపడి తాజా పెంపుతో గృహ వినియోగ సిలిండర్ ధర హైదరాబాద్‌లో రూ.1,155కు చేరిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది జులై 4న చివరిసారిగా గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ ధర పెంచారన్నారు. తెలంగాణలో గ్యాస్ కనెక్షన్లు 1.07 కోట్లు ఉన్నాయన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు వినియోగించే వీటిపై ధరలు పెంచడం తగదని హెచ్చరించారు.



గండిమైసమ్మ చౌరస్తాలో భారీ ఎత్తున కౌన్సిలర్లతో ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు



ప్రగతినగర్ చౌరస్తాలో మేయర్ నీలారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో పాల్గొన్న శంభీపూర్ రాజు

విద్యార్థులకు గ్లాండ్ ఫార్మ తోడ్పాటు

దుండిగల్: దుండిగల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు శాస్త్ర సాంకేతికతలో నైపుణ్యతను సాధించేందుకు తోడ్పాటును అందించిన గ్లాండ్ ఫార్మ పరిశ్రమ యాజమాన్యానికి పాఠశాల హెచ్ఎం నళిని ధన్యవాదాలు తెలియజేశారు. దుండిగల్‌లోని ప్రభుత్వ పాఠశాలకు గ్లాండ్ ఫార్మా సంస్థ గ్లాండ్ పోసన్ ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు భోదనా, సైన్స్, మ్యాథ్స్ పరికరాలను అందజేశారు. వాటిని ఎలా వినియోగించుకోవాలో అనే దానిపై విద్యార్థులకు వారి బృందంతో ట్రైనింగ్ ఇప్పించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఫౌండేషన్ వారు అందజేసిన వస్తువుల ద్వారా నైపుణ్యతతో వాటికి సంబంధించిన డూప్లికెట్‌లను తయారు చేసి తిరిగి వారికి అందజేశారు.

- అదే విధంగా వర్షాకాలంలో పాఠశాల ఆవరణలో నీరు నిలిచినప్పుడు నీటిని ఏ విధంగా మళ్లించాలో అనే దానిపై విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్ట్ అందరిని అబ్బురపరిచింది. గ్లాండ్ పోసన్ ఫౌండేషన్ ద్వారా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేత.



విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిట్స్‌ను తిలకిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

- సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్టుల్లో వివిధ అంశాలపై పాఠశాలలో ట్రైనర్స్ పోటీలను నిర్వహించారు. అందులో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా గ్లాండ్ ఫార్మా ట్రస్టీ రఘురామన్, గిరీష్, సుబ్బరాజు, జన్య ఫౌండేషన్ ఫౌండర్ నాదేళ్ల వేణుప్రియ, ప్రతినిధులు జయేష్, చిరంజీవిలను అభినందించారు.

వ్యభిచార గృహంపై దాడి

జగద్గిరిగుట్ట: ఓ వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులతో పాటు ఓ విటుడిగా జగద్గిరిగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఏహెచ్‌టీయూ టీమ్‌కు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు జగద్గిరిగుట్టలోని గ్లాన్స్ స్టూడియో ఎదురుగా ఉన్న ఎస్ఆర్ రెసిడెన్సీలోని ఫ్లాట్ నం.204లో వ్యభిచార గృహం నిర్వహిస్తున్నారని తెలిసింది. ఈ నేపథ్యంలో గురువారం జగద్గిరిగుట్ట పోలీసులు సదరు వ్యభిచార గృహంపై దాడులు నిర్వహించి కత్రోట్ లత అనే మహిళను రక్షించారు. అదే విధంగా నిర్వాహకులు తుంగ కవిత (40), కంద్రేగుల సతీష్ (45) లతో పాటు విటుడు నడింపల్లి నవీన్ (42) అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు సెల్ ఫోన్‌లు, రూ.2వేల నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకులంతా బీజేపీ వైపే...

- రాష్ట్ర నాయకులు రవికుమార్ యాదవ్



హఫీజ్‌పేట్ : శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని యువత బీజేపీ వైపే ఉన్నారని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు రవికుమార్ యాదవ్ అన్నారు. గురువారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని సాయినగర్‌కు చెందిన యువకులు లక్ష్మణ్ గౌడ్ ఆధ్వర్యంలో ఆయన సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ పాలన అధ్వానంగా మారిందన్నారు. కంచె చేను మేసింది అన్నట్లుగా పాలకులే ప్రభుత్వ భూములు కబ్జాలు చేస్తూ అభివృద్ధిని కుంటుపరిచారన్నారు. పార్టీలో చేరిన వారిలో సచిన్‌గౌడ్, మహేష్ రెడ్డి, అభిషేక్, కిరణ్, సాయి యాదవ్‌లు ఉన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎల్లేష్, టర్బో శ్రీనివాస్, అశోక్, రవి ముదిరాజ్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ సీఐఈలో డెమో డే

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (సీఐఈ) డెమో డేను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా 12 స్టార్టప్‌లు 50కిపైగా పెట్టుబడి నిధులకు పిచ్ చేయబడ్డాయి. ఆవిష్కార్ 16వ బృందంలో డీప్‌టెక్, మెడ్‌టెక్, మీడియా టెక్ డొమైన్ నుంచి స్టార్టప్‌లు చేర్చబడ్డాయి. సీఐఈ ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ సీఓఓ ప్రొఫెసర్ రమేష్ లోకనాథన్ మాట్లాడుతూ 50కి పైగా ఎక్కువ మంది పెట్టుబడిదారులు మా డెమోడేలో చేరడం, అటువంటి లోతైన సాంకేతిక ఆవిష్కరణలపై ఆసక్తి చూపడం చాలా ఆనందంగా ఉందన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయి

టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి

కుత్బుల్లాపూర్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా గురువారం సూరారం డివిజన్ పరిధి శివాలయనగర్, మస్తాన్ బిల్డర్స్, మస్తానా ఎన్‌క్లేవ్ ప్రాంతాల్లో ఆయన పార్టీ జెండాలను ఎగురవేశారు. అనంతరం ఇంటింటికీ తిరుగుతూ.. కాంగ్రెస్ పార్టీ హయాంలో చేపట్టిన అభివృద్ధి, తాము అధికారంలోకి వస్తే చేయబోయే కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ,రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజలను మోసం చేశాయన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్ కుమార్, ఆల్ ఇండియా దళిత సేన అధ్యక్షుడు జేమ్స్, సంజీవరెడ్డి, పండరీ రావు, మారి సంతోష్, శ్రీశైలంయాదవ్, సంపంగి వెంకటేష్, వెంకట్ రెడ్డి, రాజి రెడ్డి, నవీన్, అబ్బాస్, సలీం, సోహైల్, రజాక్ , సురేందర్ రెడ్డి, సురేష్, మల్లేష్, యాదమ్మ, గౌష్య బేగం, హసీనా, అన్నపూర్ణ, వారలక్ష్మి, మణెమ్మ, సువర్ణ, మంజుల, యువజన నాయకులు తదితరుల ఉపాల్గొన్నారు.



ప్రజలకు కరపత్రాలు పంచుతున్న టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి

హెచ్‌సీయూలో కేంద్రీయ విద్యాలయను కొనసాగించాలి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కు వినతి

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రాంగణంలో కొనసాగుతున్న కేంద్రీయ విద్యాలయను కొనసాగించేలా చూడాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌కు కేంద్రీయ విద్యాలయ విద్యార్థుల తల్లిదండ్రులు వినతిపత్రం అందజేశారు. బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో కేంద్రీయ విద్యాలయ పరిరక్షణ సమితి ప్రతినిధులు, తల్లిదండ్రులు ఆయనను గురువారం ఆయనను నగరంలో కలిశారు. కేంద్రీయ విద్యాలయ గురించి ఆయనకు వివరించారు. ప్రస్తుతం ఈ స్కూల్‌ను మూసి వేయాలని హెచ్‌సీయూ నిర్ణయించడం పట్ల వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. విద్యార్థులు తీవ్ర ఇక్కట్లు పడతారని, కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. దీనిపై బండి సంజయ్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయ తల్లిదండ్రులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



బండిసంజయ్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న రవికుమార్‌యాదవ్, విద్యార్థుల తల్లిదండ్రులు

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



పూజలో పాల్గొన్న కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపాలిటీ పరిధి ఎస్‌సీఎల్ నార్త్ ఎవెన్యూ కాలనీలో సాయిబాబా ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ అసోసియేషన్ అధ్యక్షురాలు శైలజా విన్సెంట్, ప్రధాన కార్యదర్శి నాగరాజుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి గురువారం వెయ్యి మందికి, అదే విధంగా పండుగల సమయంలో 2వేల మంది భక్తులకు దాతల సహకారంతో అన్నదానం చేపడుతూ వస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మురళీధర్, ప్రధాన కార్యదర్శి నాగరాజు, సంయుక్త కార్యదర్శి పద్మావతి, కోశాధికారి దత్తాత్రేయ, కార్యవర్గ సభ్యులు దండు వరహాలరాజు, సంగీత, శ్రీలత, పండరిరావు, కేఆర్‌కే రాజు, సంతోష్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి పనులు పూర్తి చేస్తాం

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి నగర్, ఆస్‌బెస్టాస్ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారం, చేపట్టవలసిన అభివృద్ధి పనులపై గురువారం ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీలు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామన్నారు. దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని, అసంపూర్తి పనులు త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రాజస్థాన్, బిహార్ రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ నివసిస్తున్న వారిని ఎంపీ రంజిత్‌రెడ్డి పలకరించారు. సమస్యలు ఉన్నాయా అని ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణలక్ష్మీ, కేసీఆర్ కిట్, ఆసరా పింఛన్లు, రైతు బంధు, రైతు భీమా వంటి అనేక పథకాలను అందజేస్తూ వారి జీవితాలలో వెలుగులు నింపుతున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్‌యస్ నాయకులు, కార్యకర్తలు, వార్డు మెంబర్లు, కమిటీల ప్రతినిధులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



పాపిరెడ్డినగర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే గాంధీ తదితరులు

సైక్లింగ్ సంఘ సభ్యులకు సీపీఆర్ శిక్షణ



సభ్యులకు సీపీఆర్ శిక్షణ ఇస్తున్న ఎస్ఎల్‌జీ వైద్య బృందం

గచ్చిబౌలి: అత్యవసర సమయాల్లో పక్కన ఉన్నవారి ప్రాణాలను రక్షించడానికి బేసిక్ లైఫ్ సపోర్ట్ (బీఎల్ఎస్) శిక్షణ చాలా ముఖ్యం. ప్రధానంగా సీపీఆర్ చేయడం తెలిస్తే ఎవరికైనా గుండెపోటు వచ్చినప్పుడు వారి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుంది. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియం వెలుపల ప్రాంతంలో సుమారు వంద మంది సైక్లింగ్ సంఘం సభ్యులకు ఎస్ఎల్‌జీ ఆస్పత్రికి చెందిన ఎమర్జెన్సీ విభాగాధిపతి డాక్టర్ టి అప్పిరెడి ఆధ్వర్యంలో అదే విభాగానికి చెందిన డాక్టర్ హేమసింధు, డాక్టర్ విఠల్‌లు సభ్యులతో బొమ్మలపై సీపీఆర్ ప్రాక్టీస్ చేయించారు. ప్రతి ఒక్కరూ స్వయంగా చేయడం ద్వారా ఎక్కడ ఎంతసేపు కంప్రెషన్లు ఇవ్వాలో తెలుసుకున్నారు. ఇది తోటి వారి ప్రాణాలను కాపాండేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

హత్యకు గురైన యువకుడి ఆచూకీ లభ్యం

ప్రేమ కోసమే హత్య చేశారని నిర్ధారించిన పోలీసులు



దేవరకొండ హరీష్ (ఫైల్)

కుత్బుల్లాపూర్: హత్యకు గురైన యువకుడి ఆచూకీ లభించింది. బుధవారం రాత్రి దూలపల్లి ప్రధాన రహదారిపైనే అత్యంత విచక్షణ రహితంగా కత్తులతో దాడి చేసి హత్య చేసిన విషయం కలకలం రేపగా.. ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న పేట్‌బషీరాబాద్ సీఐ ప్రశాంత్ నిందితులను గుర్తించే పనిలో పడ్డారు. ఈ క్రమంలో సూరారం ప్రాంతానికి చెందిన డీజే ప్లేయర్ దేవరకొండ హరీష్ మృతుడు అని తేలింది. ఈ హత్య విషయం ప్రేమ కోసమే అని నిర్ధారించిన పోలీసులు బంధువుల ఫిర్యాదు మేరకు నిందితుల కోసం వేట ప్రారంభించారు.

- బుధవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో దూలపల్లి ప్రధాన రోడ్డులో ఓ యువతితో ఉన్న యువకుడిని ముగ్గురు వ్యక్తులు రెండు స్కూటీపై వచ్చి పథకం ప్రకారం హత్య చేసి యువతితో పరార్ అయ్యారు. ఘటన స్థలానికి చేరుకున్న ఏసీపీ రామలింగరాజు, సీఐ ప్రశాంత్ ఘటన స్థలంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా హత్య చేసిన వ్యక్తులు దూలపల్లి నుంచి కొంపల్లి మీదుగా సుచిత్ర నుంచి బోయిన్‌పల్లి వైపు వెళ్లినట్లు గుర్తించారు. రెండు బృందాలు విడిపోయి సుమారు 1000 కెమెరాలను పరిశీలించగా ఎట్టకేలకు హత్య గురైన యువకుడి ఆచూకీ లభించింది. మృతుడి తల్లి ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రేమా వ్యవహారమే కారణమని తేలింది. అయితే హత్యకు గల కారణాలపై పోలీసులు పలు కోనాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా శ్రీవేంకటేశ్వరస్వామి పుష్కర బ్రహ్మోత్సవాలు



కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ గోదావరి హోమ్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ పుష్కర బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా గురువారం సుదర్శన ఇష్ఠి, మహాపూర్ణాహుతి, మహాకుంభ సంప్రోక్షణ, చక్రస్నానం, సాయంత్రం దేవతోద్వాసన, శ్రీపుష్పయాగం, ధ్వజావరోహణం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అధ్యక్షుడు తిరుమలరావు, ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డిల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.



గోదావరిహోమ్స్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో మహాపూర్ణాహుతి నిర్వహిస్తున్న వేద పండితులు